విశ్వరూప మహాసభకు తరలిరావాలి

వేలేరు : ఈనెల 11వ తేదీన హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న మాదిగ విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మెస్పీ జిల్లా కన్వీనర్ గంగారపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ పేరుతో కాలయాపన చేస్తూ మాదిగలను మోసం చేస్తుందని విమర్శించారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ఏబీసీడీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కనకం రాజయ్య, నాయకులు పెరుమయ్య, అక్కల శంకర్, రాజు, మురళి పాల్గొన్నారు.


వేలేరు : కరపత్రం ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎమ్మెస్పీ నాయకులు

పరకాలలో..

పరకాల: ఈ నెల 11వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూపం మహాసభకు రాజకీయ పార్టీలకతీతంగా విద్యార్థులు, యువకులు హాజరుకావాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు జిల్లెల మురళి పిలుపునిచ్చారు. పట్టణంలోని గణపతి డిగ్రీ కళాశాల ఆవరణంలో మాదిగల విశ్వరూపం మహాసభ కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రం ఇచ్చిన మాటకు కట్టుబడి ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. డిమాండ్ల సాధనకు నిర్వహించతలపెట్టిన సభకు మాదిగ బిడ్డలు తరలిరావాలన్నారు. రాజేష్, రాంబాబు, ప్రమోదు, చందర్, సునీత, కవిత, ప్రవళిక పాల్గొన్నారు.


పరకాల : కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

● ఏసీపీ కిశోర్‌కుమార్

ఆత్మకూరు : అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీల నాయకులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఏసీపీ కిషోర్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో మండలానికి చెందిన పలు రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎన్నికల నిర్వహణకు నాయకులు సహకరించాలని, ఎలాంటి గొడవలకు పాల్పడకుండా ఉండాలని కోరారు. సమస్యలు ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ రవిరాజు, ఎస్సైలు ప్రసాద్, రాజేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏసీపీ కిశోర్‌కుమార్

పట్టపగలే క్షుద్ర పూజల కలకలం

పరకాల: కొంత కాలంగా మాయలు, మంత్రాల పేరిట కొందరు క్షుద్ర పూజలు చేస్తూ పట్టణ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. పట్టణంలోని బీసీ కాలని, మాదారం, రాంనగర్, ఆకుల వాడ, సీఎస్ఐ హైస్కూల్ వద్ద ప్రతీ రోజు క్షుద్ర పూజల చేసిన ఆనవాళ్లు దర్శనమిస్తున్నాయి. అర్ధరాత్రే, పట్టపగలు కోడి గుడ్లు, మూడు బాటల వద్ద నిమ్మకాయాలు, పసుపు, కుంకుమ, నల్లని రంగుతో కలిపిన అన్నం ముద్దలు, కొబ్బరికాయలు రోడ్లుపై పెడుతున్నారు. కొందరైతే రాత్రి వేళలో నల్లని కోడి కాళ్లను కట్టేసి వదిలిపెడుతుండటంతో వీధి కుక్కలకు ఆహారంగా మారుతున్నాయి. వీటిని చూసి కాలనీల వాసులు భయాందోళన చెందుతున్నారు. వాహనాదారులు గమనించకుండా కొబ్బరికాయాలపై నుంచి దూసుకెళ్లడంతో పడిపోయి గాయాల పాలవుతున్నారు. క్షుద్రపూజల పేరుతో ప్రజలను భయోభ్రాంతులకు గురిచేస్తున్న వారిని గుర్తించి పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


రోడ్డుపై క్షుద్రపూజల ఆనవాళ్లు

ప్రజల ఆశీర్వాదంతో భారీ మెజారిటీతో గెలుస్తా

● బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్: ప్రజలు ఆశీర్వదిస్తే అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండలంలోని బత్తినివానిపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం సతీసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. గోపాల్‌పూర్, శనిగరం, మాదన్నపేట, గూనిపర్తి గ్రామాల్లో పర్యటించి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే హుజూరాబాద్ నియోజకవర్గాన్ని రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేస్తానన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే శనిగరం, ఉప్పల్ గ్రామాలను ప్రత్యేక మండలాలుగా ఏర్పాటు చేస్తామని, ఇది తాను చెప్తున్నది కాదని, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ స్వయంగా చెప్పిన మాట అన్నారు. కేసీఆర్ రూపొందించిన కొత్త మేనిఫెస్టోతో పాటు కౌశిక్‌రెడ్డి స్వయంగా రూపొందించుకున్న మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అనంతరం కౌశిక్‌రెడ్డి భార్య శాలిని మాట్లాడుతూ.. ప్రజల కోసం పనిచేసే కౌశిక్‌రెడ్డిని గెలిపించాలని కొంగుచాచి ఓట్లను అభ్యర్థించారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి అవడం ఖాయమని, ఇక్కడ కౌశిక్‌రెడ్డిని కాకుండా వేరే వారిని గెలిపిస్తే అభివృద్ధి కుంటుపడుందని మాజీ మంత్రి, హుజూరాబాద్ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ ఇనుగాల పెద్దిరెడ్డి అన్నారు. ప్రజలు వెళ్లగొట్టకముందే ఇక్కడి ఎమ్మెల్యే హుజూరాబాద్‌ను వదిలిపెట్టి మరొక చోటకు పోతున్నాడని విమర్శించారు. హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే ఈటల రాజేందర్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఎంటో ప్రజలకు చెప్పాలని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. అనంతరం కొనేరెళ్లకు చెందిన ఆరె కుల సంక్షేమ సంఘం మండల ప్రధాన కార్యదర్శి బాసిరి కృష్ణ బీఆర్ఎస్‌ల చేరగా కౌశిక్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణరావు, సీనియర్ నాయకుడు ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఓట్లు అభ్యర్థిస్తున్న కౌశిక్‌రెడ్డి దంపతులు

ఒకరిపై కేసు నమోదు

శాయంపేట : అనారోగ్యం బారిన పడిన తండ్రికి చికిత్స నిమిత్తం ఖర్చు చేసిన డబ్బులు ఇవ్వాలని గొడవ చేస్తూ అన్నా, తమ్ముడిపై కర్రతో దాడి చేసిన సంఘటన పత్తిపాక గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై దేవేందర్ తెలిపిన వివరాలు ప్రకారం. గ్రామానికి చెందిన పల్లెబోయిన సారయ్యకు రవి, సుధాకర్, శ్రీను కుమారులు ఉన్నారు. సారయ్య అనారోగ్యం బారిన పడగా ఆస్పత్రిలో చికిత్స అందించారు. సుమారు 30వేలు ఖర్చు రగా రెండో కుమారుడు సుధాకర్ రూ. 5వేల ఖర్చు భరించి డబ్బులు ఖర్చు అయ్యాయని దుర్భాషలాడుతుండగా రవి మందలించాడు. దీంతో సుధాకర్ కర్రతో అన్నయ్య, రవి, తమ్ముడు శ్రీనుపై దాడి చేశాడు. రవి ఫిర్యాదు మేరకు సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గండి పూడ్చివేత



శాయంపేట : మండలంలోని జోగంపల్లి శివారులో గల చలివాగు ప్రాజెక్టు కాల్వకుగండి పడగా బుధవారం అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు.

సబితకు డాక్టరేట్



హన్మకొండ అర్బన్: నగరంలోని పింగిళి మహిళా ప్రభుత్వ కళాశాలలో అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న లెఫ్టినెంట్ బుద్దే సబితకు హర్యానా రాష్ట్రంలోని హిస్సార్‌లోని ఓం స్టెర్లింగ్ గ్లోబల్ యూనివర్సిటీ.. రసాయన విభాగంలో డాక్టరేట్ ప్రకటించిందని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి ఒక ప్రకటనలో తెలిపారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ రేణుశర్మ పర్యవేక్షణలో 'స్పెక్ట్రోస్కోపిక్ అండ్ థర్మల్ స్టడీస్ ఆన్ ప్యూర్ అండ్ ఈరేడియేటెడ్ పాలిమర్స్ అండ్ కోపాలిమర్స్' అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సబితకు డాక్టరేట్ లభించినట్లు పేర్కొన్నారు. కాగా, తన పరిశోధనకు సహకరించిన ప్రిన్సిపాల్ చంద్రమౌళి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, ఓఎస్‌జీయూ అధ్యాపకుడు, ప్రొఫెసర్ జలపతి, ఎన్ఐటీ ప్రొఫెసర్లు, కళాశాల మేనేజ్‌మెంట్, అధ్యాపకులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

సంచార వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

హసన్‌పర్తి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మొబైల్ మెడికేర్ యూనిట్ హనుమకొండ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలం నాగారంలో గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం సంచార వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అరుణ్ మాట్లాడుతూ ప్రతీ నెలా గ్రామంలో మొబైల్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కిషన్‌రావు, డాక్టర్ మదన్ మోహన్‌రావు, సిబ్బంది శివకుమార్, గంగాధర్, సాగర్, పవన్, సతీష్, రమేష్ పోశాలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● జెడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్

ఎల్కతుర్తి: బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి కొనసాగుతుందని, ప్రచారానికి వెళ్లిన ప్రతీ గ్రామంలో ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని జెడ్పీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్ అన్నారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలతో పాటు తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తిస్తున్నారని అన్నారు. ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా మూడోసారి బీఆర్ఎస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ జక్కుల అనితరమేష్, ఇంద్రనీల్, జెడ్పీటీసీ వంగ రవీందర్, మండల అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్

దాడి చేసిన వ్యక్తిపై చర్య తీసుకోవాలి

వేలేరు : దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కత్తితో దాడి చేసిన వ్యక్తిని చట్ట ప్రకారం శిక్షించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మరిజె నర్సింగరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యంలేక బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఏఎంసీ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుజ్జుల రాంగోపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు కాయిత మాధవరెడ్డి, రాజిరెడ్డి, రమేష్, కుడా మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి, యూత్ అధ్యక్షుడు గోవింద బొజ్జ రవీందర్, మారబోయిన రాజు, జోగు ప్రసాద్ పాల్గొన్నారు.

ధర్మసాగర్: బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి చేసిన నింధితుడిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మునిగెల రాజు, జెడ్పీటీసీ పిట్టల శ్రీలత, సీనియర్ నాయకుడు బొడ్డు ప్రభుదాస్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి వస్తుందనే సంకేతంతో ఓర్వలేక ప్రతిపక్షాలు భౌతిక దాడులకు ప్రేరేపిస్తున్నాయని ఆరోపించారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సర్పంచ్ శరత్, ఎంపీటీసీలు రొండి రాజు, జాలిగపు వనమాల, బొడ్డు శోభ, సర్పంచ్‌లు మామిడి రవీందర్, గోనెల సమ్మక్క రాజయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు జుబేదాలాల్, కొలిపాక రజిత, రాజమణి, సోమయ్య, రఘు, కుమార్, ప్రతాప్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మునిగెల రాజు

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

వేలేరు : మండలంలోని రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అసిస్టెంట్ పీడీ శ్రీనివాస్ కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం జన్ను ప్రకాష్, ఏపీఎం జయసుధ, సీసీలు నిత్యానందం, అశోక్ పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

● ఎస్సై దేవేందర్

శాయంపేట : మండలంలోని యువకులు, విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై దేవేందర్ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్, రోడ్డు ప్రమాదాలు, డయల్ 100పై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలకార్మికులు, బాల్య వివాహాలతో వచ్చే సమస్యలు, సీసీ కెమెరాల ఉపయోగంపై వివరించారు. గుట్కా, గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. చెడు మార్గంలో వెళ్లి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్సై దేవేందర్

ఓట్లు అడిగే హక్కు బీజేపీకే ఉంది


శాయంపేట : మాట్లాడుతున్న కీర్తిరెడ్డి


దామెర : బీజేపీలో చేరుతున్న నాయకులు

శాయంపేట : రైతులకు కావాల్సిన ఎరువులపై సబ్సిడీ అందించామని, వారిని ఓట్లు అడిగే హక్కు బీజేపీకి మాత్రమే ఉందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎస్‌వీకేకే ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం రమేష్ అధ్యక్షతన బూత్, మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో రైతులకు ఎలాంటి మేలు జరగలేదని అన్నారు. బూత్ స్థాయి కార్యకర్తలు 30రోజుల పాటు కష్టపడి పని చేయాలని, విజయం మనదేన్నారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యనారాయణరావు రాజకీయ లబ్ధి కోసమే పార్టీలు మారారని, వారిని ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. భూపాలపల్లి, హనుమకొండ జిల్లాల మాజీ అధ్యక్షులు వెన్నంపల్లి పాపయ్య, ఎడ్ల అశోక్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ రవీందర్, నాయకులు రవికిరణ్, మొగిలి, రామకృష్ణ, రాజు, విద్యాసాగర్, ఈశ్వరయ్య, మోహన్‌రెడ్డి, నాగరాజు, స్వరూప, రమాదేవి, నిర్మల, నవీన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దామెర: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కాశీప్రసాద్ రావు అన్నారు. మండలంలోని పరసరగొండలో వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు బీజేపీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, సీనియర్ నాయకుడు మంద ఐలయ్య, మండల నాయకులు శ్రీనివాస్, రతన్‌కుమార్, బుచ్చిరెడ్డి, చందర్, రమేష్, అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరు : పార్టీలో చేరిన వారితో భిక్షపతి

ఆత్మకూరు : పరకాల నియోజకవర్గంలో బీజేపీ గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. బుధవారం మండల కేంద్రానికి చెందిన 50 మంది ముదిరాజ్‌లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. మండల అధ్యక్షుడు సదానందం, ఎంపీటీసీ రామరాజు, జిల్లా నాయకుడు జయంత్‌లాల్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, కార్యదర్శి పైడి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



యోగా పోటీల్లో విజేతగా నిలిచిన విద్యార్థులు

దామెర : 67వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఓవరల్ ఛాంపియన్ షిప్ సాధించారు. అండర్ 17విభాగంలో బాలుర, బాలికల విభాగంలో హరికృష్ణ, వైష్ణవి, రిథిమిక్ విభాగంలో అభినవ్, నేతాజీ గోల్డ్ మెడల్ సాధించారు. సిద్దిపేట జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి బహుమతులు అందించారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ధన్యనాయక్, వరంగల్, హనుమకొండ యోగా అసోసియేషన్ సభ్యుడు డాక్టర్ చంద్రశేఖర్‌ఆర్యా, శ్రీధర్, సెక్రటరీ కమలాకర్, కిరణ్, రవీందర్ పాల్గొన్నారు.

అమరులను స్మరించుకుందాం..

వరంగల్ అర్బన్: భూమి, భుక్తి విముక్తి కోసం పోరాడి అసువులు బాసిన అమరులను స్మరించుకుంటూ గ్రామగ్రామాన సంస్మరణ సభలు నిర్వహించాలని ఏఐఎఫ్‌టీయూ (న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం పిలుపునిచ్చారు. వరంగల్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం సీపీఐ (ఎంఎల్) నర్సంపేట జోనల్ కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ భారత విప్లవ పోరాటాల్లో ఎంతో మంది అమరులయ్యారని గుర్తుచేశారు. ఉన్నత చదువులు, ఉద్యోగాలు, కుటుంబాలను వదిలి భూమి, భుక్తి, విముక్తి కోసం, ఆదివాసీ, గిరిజన, దళిత, బహుజన హక్కుల కోసం పోరాటాలు చేశారని కొనియాడారు. కొంతమంది అనారోగ్యాలతో మరణించగా, మరి కొంతమంది బూటకపు ఎన్‌కౌంటర్లలో అసువులు బాసారని ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కమలాపూర్: మండలంలోని శనిగరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రాములు బుధవారం ప్రకటనలో తెలిపారు. చెట్ల కొమ్మలను తొలగించేందుకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. శనిగరం, గోపాల్‌పూర్, బత్తినివానిపల్లి (రామానుజాపూర్), మాదన్నపేట, గూనిపర్తి, శ్రీరాములపల్లి, అంబాల, లక్ష్మీపూర్, నేరెళ్ల గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మండల కమిటీ ఎన్నిక


గొర్రె రమేష్

వేలేరు : భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరనరసింహులు బుధవారం ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా గొర్రె రమేష్, ఉపాధ్యక్షులుగా బాణాల సుధాకర్, రవి, ప్రధానకార్యదర్శిగా రమేష్, కార్యదర్శులుగా సుదర్శన్, రాజు, కోశాధికారిగా దేవయ్య, కార్యవర్గ సభ్యులుగా పులి ఆనందం, లింగమూర్తి, రాజేందర్, వినీత్, కొమురయ్య, తిరుపతిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్ కాయిత మాధవరెడ్డి, ఉపసర్పంచ్ సద్దాం హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శి కూమారస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి అజ్మద్దీన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం



శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఎమ్మెల్యేగా గండ్ర వెంకటరమణారెడ్డిని గెలపించాలని కోరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం అశోక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో చేరికలు



శాయంపేట : మండలంలోని రాజుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు అట్ల రాజేందర్, తిరుపతిరావు, రాజు, రఘు, రవీందర్, దేవేందర్‌తో పాటు మరో 20మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి టీపీసీసీ సభ్యుడు, భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు కండువా కప్పి ఆహ్వానించారు. మాజీ జెడ్పీటీసీ చల్ల చక్రపాణి, నాయకులు రవీందర్, కృష్ణమూర్తి, డీటీ రెడ్డి, లక్ష్మణ్‌రావు, నర్సింగరావు, పరమేశ్వర్, సుమన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో..



మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ చింతల భాస్కర్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన మరో 20మంది బుధవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నత్తి పైడి, తట్ల సాయి, విష్ణు, శ్రీకాంత్, సాయి, దినేష్, అఖిల్, రమేష్, లక్ష్మణ్, శశికుమార్‌కు ఎమ్మెల్యే రమణారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సుమన్, నాయకులు రాజిరెడ్డి, చంద్రమౌళి, జయపాల్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

పట్టాలిచ్చే వరకు పోరాటం



శాయంపేట : మండలంలోని గోవిందాపూర్ రెవెన్యూ శివారులోని 633 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో గుడిసెలు ఏర్పరుచుకున్న పేదలకు పట్టాలిచ్చే వరకు ఉద్యమిస్తామని తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా భూపాలపల్లి నియోజకవర్గ అభ్యర్థి వంగరి సాంబయ్య స్పష్టం చేశారు. బుధవారం ఆయన గుడిసెవాసులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే పట్టాలు ఇచ్చే వరకు ఉద్యమిస్తానని హామీ ఇచ్చారు.

ఆర్థిక భద్రతపై అవగాహన

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐసీఐసీఐ ఫౌండేషన్ హైదరాబాద్ నేతృత్వంలో ఫైనాన్షియల్ అంశాలపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా కేకే.గంగధర్‌రావు హాజరై మాట్లాడారు. బ్యాంకులు, ఇన్సూరెన్స్, ఆర్థిక భద్రత, పొదుపు, పెట్టుబడులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.